# సామ్రాజ్యవాదులు సృష్టించిన 'పైరు పచ్చ విప్లవం'

## నేటికీ వెంటాడుతున్న దుష్ఫలితాలు

**పైరుపచ్చ** విప్లవం మనదేశ వ్యవసాయ రంగంలో అమోఘమైన అభివృద్ధిని తెచ్చిందని మనదేశ పాలకులు ఎడతెగకుండా పదేపదే చెబుతూనే వస్తున్నారు.

మనం దీనిని విమర్శనాత్మకంగా పరిశీలించితే, మనదేశంలో వ్యవసాయాభివృద్ధికి సహాయంపేరిట అమెరికా సామ్రాజ్యవాదం రూపకల్పనచేసి ముందుకు నెట్టిన ఆర్థిక కార్యక్రమమే ఈ పైరుపచ్చ విప్లవమని స్పష్టమౌతోంది. ఈ 'అమెరికా సహాయమ'నేది ప్రపంచబ్యాంకుద్వారా అమలుచేయబడింది. ఈ పథకానికి ప్రపంచబ్యాంకు తుదిరూపమిచ్చింది.

భారతదేశంలో 'పైరుపచ్చ విప్లవం' ద్వారా జరిగిందని చెబుతున్న అభివృద్ధి స్పష్టంగానూ, కళ్ళకు కనపడేదిగానూ లేకున్నా, పారిశ్రామిక దేశాలనుండి ప్రత్యేకించి అమెరికానుండి మన దేశ వ్యవసాయరంగం అదనపు వ్యవసాయ సరుకుల కొనుగోళ్ళకు అవసరమైన 'లాభదాయక గిరాకీ'ని తప్పనిసరిగా సృష్టించిందనేది వాస్తవం. పారిశ్రామిక సరుకుల కొరకు అందులోనూ ముఖ్యంగా క్రిమిసంహారిణులు, కీటక నాశనిల కొరకు ఒక భారీ మార్కెట్‌ను పైరుపచ్చ విప్లవం సృష్టించింది. అదే సమయంలో భారత వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేయబడింది.

సామ్రాజ్యవాదులు సృష్టించిన ఈ తీవ్ర సంక్షోభాన్నుండి బయటపడే మార్గంగా సామ్రాజ్యవాదులే పేర్కొంటున్న 'మరో పైరుపచ్చ విప్లవాన్ని' మన పాలకులు మరియు వారి సమర్థకులైన మేధావులు సూచిస్తూ, ముందుకు తెస్తున్నారు.

వాస్తవానికి మనదేశంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలుతో వ్యవసాయ రంగంలో సంక్షోభం మరింత తీవ్రమైంది. తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకొనేందుకు విదేశీ ప్రైవేటు పెట్టుబడితోసహా విదేశీ పెట్టుబడి ముసుగులో ప్రపంచబ్యాంకు మరియు వారి ద్రవ్యసంస్థలు మనదేశంలో అమలుచేస్తున్న విధానాలతో ప్రజానీకం–ప్రత్యేకించి రైతాంగం తీవ్ర దుస్థితికి, దుర్భర పేదరికానికి నెట్టబడ్డారు. విదేశీ ప్రైవేటు పెట్టుబడి ఆధిపత్యంలోని మార్కెట్‌శక్తుల అదుపులోను, యాజమాన్యంలోనూ వున్న వ్యవసాయ ఉత్పాదకాలైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కీటకనాశనిలు వంటి వాటి ధరలన్నింటినీ అనూహ్యంగా పెంచి వేసి, వ్యవసాయాన్ని గిట్టుబాటుకానిదిగా, నష్టదాయకమైనదిగా మలిచారు. దీనితో చిన్న, మధ్యతరహా రైతాంగం దివాళా తీయటంతో పాటు వారి ఆర్థిక అవసరాలను అందుకోలేని స్థితిలో అనివార్యంగా అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

పెద్దఎత్తున రైతాంగాన్ని ఆత్మహత్యలవైపు నెడుతున్న ఈ స్థితి, పైరుపచ్చ విప్లవంయొక్క ఒకానొక దుష్పరిణామమే. అయితే ఈ పైరుపచ్చ విప్లవంయొక్క మరింత క్రూరమైన దుష్ఫలితాలు వెలుగుజూస్తున్నాయి. దేశవ్యాపితంగా రైతుల, వ్యవసాయ కూలీల మరణాలకు విషపూరితమైన క్రిమిసంహారిణులే కారణంగా వున్నాయి. క్రిమి సంహారకమందులు లేదా కీటక నాశనిల కారణంగా కేవలం అక్టోబర్ నెలలో మాత్రమే జరిగిన మరణాల వివరాలను పరిశీలిస్తే కూడా, రైతాంగంపై రుద్దబడిన ఈ దుర్మార్గం ఎంతటి ప్రమాదకంగా మారిందో అర్థమౌతుంది. మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లాలో పురుగు మందుల సంబంధిత మరణాలపై ప్రసార మాధ్యమాలు దృష్టిపెట్టి వెల్లడిచేయటం ప్రారంభమైన తర్వాత, పరిగణించదగిన స్థాయిలో పురుగుమందుల విషం కారణంగా సంభవిస్తున్న మరణాల వివరాలు పత్రికలలో వెల్లడవుతున్నాయి.

మహారాష్ట్రలో రైతాంగంయొక్క ఈ తరహా మరణాలు పత్రికలద్వారా వెల్లడి కాకముందు కూడా, గత 40 సం॥లుగా మనదేశంలోని అనేక ప్రాంతాలలో ఈ రకమైన మరణాలు సంభవిస్తూనే వున్నాయి. అయితే, ఈ మరణాలు ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి వెళ్ళటంలేదు. పత్రికలు, ప్రచారమాధ్యమాలు కూడా క్రిమిసంహారాల కారణంగా సంభవించే రైతాంగ మరణాలపట్ల పట్టనితనంతో వ్యవహరించాయి. ప్రాధాన్యతలేని విషయాలుగా పాలనాయంత్రాంగం, ప్రభుత్వాలు ఈ మరణాలను పట్టించుకోకుండా చాలా తేలిగ్గా ప్రక్కకు పెట్టేశాయి. ప్రభుత్వాల, పాలనా యంత్రాంగపు ఈ నిర్లక్ష్యం కేవలం అమాయకత్వమో అజ్ఞానమో లేక అవగాహనా రాహిత్య కారణంగానో మాత్రమే జరుగుతున్నది కాదు. పైగా, ప్రభుత్వ పాలనాయంత్రాంగానికి– పురుగుమందుల, చీడనాశని మందుల వ్యాపార వర్గానికి నడుమనున్న ప్రమాదకరమైన అనుబంధం కారణంగానే ఈ మరణాలు చోటుచేసు కుంటున్నాయి. సామ్రాజ్యవాద విదేశీ పెట్టుబడి తోనూ, దాని బడా వ్యాపారవర్గాలతోనూ మన పాలకుల, పాలకవర్గాల దేశద్రోహకరమైన లొంగుబాటు ఫలితంగానే ఈ పరిణామాలు జరుగుతున్నాయి.

మనదేశంలోని రైతాంగం వ్యవసాయోత్పత్తికి చేస్తున్న మొత్తం ఉత్పాదక వ్యయంలో 35 శాతం కేవలం పురుగుమందుల / క్రిమిసంహారిణుల కొనుగోలు కోసమే వెచ్చించటం, ఆశ్చర్యం గొలిపే వాస్తవం. భారతదేశంలోని వ్యవసాయ రంగాన్ని, చిన్న–సన్నకారు రైతుల, వ్యవసాయ కూలీల జీవితాలను బలిపెట్టి, మనదేశంలో సామ్రాజ్యవాద పురుగుమందుల/కీటకనాశని కంపెనీలకు లాభదాయకమైన మార్కెట్‌ను ఏవిధంగా 'పైరుపచ్చ విప్లవం' అభివృద్ధిచేయ గలిగిందో ఈ వాస్తవం తెలియజెప్తోంది.

వాస్తవంగా, పురుగుమందుల/కీటకనాశనిల వ్యాపారం, విదేశీ పెట్టుబడిని మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లచేస్తూ, హంతక వ్యాపార వాణిజ్యంగా తయారుచేసిందన్నది స్పష్టం.

చీడ పీడలను, క్రిమికీటకాలను తట్టుకొని, వాటిని నిలవరించి అధిక దిగుబడిని సాధిస్తుందని అమెరికాకు చెందిన గుత్త విత్తన

కంపెనీ మోన్‌శాంటో, దాని అనుబంధసంస్థలు మరియు భారతదేశంలో వారి భాగస్వాములు పెద్దఎత్తున ప్రచారం చేసిన బి.టి. పత్తి విత్తనాల మోసకారీతనం ఇప్పటికే రుజువైంది. దాదాపు 2 సం॥ల కాలం బి.టి. విత్తనాలు వాడిన పత్తిరైతులు తమ పైరు లను చీడపీడలు, క్రిమికీటకాలు ఆశించటంతో, ఈ విపత్తునుండి బయటపడేందుకు పురుగు మందులను వాడేందుకు అనివార్యంగా నెట్ట బడ్డారు. దీనిని ఆసరా చేసుకొని, ప్రమాదకర రసాయనాలతో కూడిన పురుగుమందులను విక్రయించే కంపెనీలు, నిషేధిత రసాయనాలతో తయారైన పురుగుమందుల అమ్మకాలను ప్రోత్సహించాయి. చీడపీడలతో తల్లడిల్లుతూ దీనినుండి బయటపడేందుకు వెంపర్లాడుతున్న అమాయకులైన, విషయపరిజ్ఞానం తగినంతగా లేని రైతులకు, కల్తీ, నకిలీ పురుగుమందులను కూడా అమ్మి భారీగా సొమ్ముచేసుకున్నారు.

బి.టి.పత్తి చేలలో పురుగుమందుల విష ప్రభావానికి లోనై యవత్మల్ జిల్లాలో రైతులు, వ్యవసాయ కూలీలు మరణించగా, 2017 నవంబర్ రెండవ వారంలో చీడపురుగుల దాడితో పంటలు సర్వనాశనం కావటంతో 9 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వ్యవసాయార్ధిక రంగంలో సంబంధం కలిగిన నిపుణుల అంచనా ప్రకారం, భవిష్యత్తులో ఈ తరహా ఆత్మహత్యల సంఖ్య ఆందోళనకరంగా పెరగనుంది. ప్రభుత్వ సంస్థలు సరఫరాచేసిన నకిలీ పురుగుమందులు, తగిన సమయంలో సాంకేతిక సహాయ మందించాల్సిన వ్యవసాయాధికారులు స్పందించ కుండా నిర్లక్ష్యం వహించటం – చట్టప్రకారం పురుగుమందుల, చీడపీడమందుల వ్యాపారాన్ని అదుపు చేసి, నియంత్రించకపోవటం– కారణంగా ఈ పరిస్థితి కొనసాగుతోంది.

ఒక్క మహారాష్ట్ర రాష్ట్రంలోనే పురుగు మందుల విషప్రభావానికి గురై ఇటీవలే 48 మంది మరణించగా, 1800 మంది ప్రజానీకం ఈ కారణంగా అస్వస్థతకు గురయ్యారనే వార్త కలచివేస్తోంది.

పురుగుమందుల అవశేషాలను కలిగివున్న ఆహారపదార్థాలను, కూరగాయలను తీసుకున్న కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, విజయవాడ, విశాఖ, ఒంగోలు, కర్నూలు, తిరుపతి ప్రాంతాలలో అనేకమంది 'అప్లాస్టిక్ ఎనీమియా' అనే ఓ కొత్తవ్యాధికి గురవుతున్నారని ఇటీవలే వెలుగులోకి వచ్చింది. ప్రతి సం॥రం 3 నుండి 4 వేల వరకూ ప్రజలు ఈ రోగాల బారిన పడుతూండగా, అనేకమంది ఈ కారణం గానే మరణిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వరిసాగు చేస్తున్న పొలాలలో జులై –డిసెంబర్ మధ్యకాలంలో 'ఫోరాటే–10జి' గుళికలను వెదజల్లిన వ్యవసాయ కార్మికులు విషప్రభావానికి గురవుతున్నారనే వార్త కూడా ఇటీవలే వెలుగుచూసింది. ఈ కారణంగా కూడా అనేకమంది మృత్యువాతపడుతున్నారు. కానీ ప్రభుత్వం, వారి పాలనాయంత్రాంగం మాత్రం, పురుగు మందుల విషప్రభావ కారణంగా సంభవిస్తున్న మరణాలను గుర్తించటానికే నిరాకరిస్తోంది.

ఇటీవల, 2017 డిసెంబర్ 3న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం–విజయనగరం జిల్లా– గుర్ల మండలం–కెల్ల గ్రామంలో రసాయన పురుగు మందుల విషప్రభావానికి లోనైన నాలుగు కేసులు నమోదయ్యాయి. వరిపంట కుప్ప నూర్చిన నలుగురు వ్యవసాయ కార్మికులు వాంతులు, విరేచనాలతో అస్వస్థులయ్యారు. వారిని దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించుతుండగానే వారిలో ఇరువురు మరణించారు. మరో ఇద్దరి పరిస్థితి అప్పటికి ప్రమాదకరంగానే వుంది. వారు నూర్పిళ్ళు చేసిన వరిధాన్యం పంటదశలో వున్నప్పుడు పంటపై రసాయనక్రిమి సంహారాలను ఉపయోగించారు. రసాయన క్రిమిసంహారాల విషప్రభావం కారణంగానే ఈ వ్యవసాయ కూలీలు అస్వస్థు లవటం, మరణాలు సంభవించాయని, వారికి చికిత్స చేసిన వైద్యులు అభిప్రాయపడ్డారు. తన అంతులేని అమానవీయ లాభాలవేటలో విదేశీ పెట్టుబడి రూపొందించి, అమలుచేసిన పైరుపచ్చ విప్లవంద్వారా భారత వ్యవసాయరంగం ఎలాంటి దుష్పరిణామాలకు లోనైందో, ఈ సంఘటన ఒక్కటే తేటతెల్లంచేస్తోంది.

యధాప్రకారం ప్రభుత్వమూ, వారి పాలనా యంత్రాంగమూ విచారణల నాటకాన్ని ప్రారంభించాయి. విషపూరిత పురుగుమందులను అసాధారణ పరిమాణంలో ఉపయోగించే టప్పుడు, పురుగుమందుల కంపెనీల భద్రతా హెచ్చరికలను బాధితులైన రైతులు, వ్యవసాయ కూలీలు పాటించలేదనటంతోపాటు, పురుగు మందులు చల్లేపుడు వారు సూచించిన విధంగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవటమే మరణాలకు కారణమనే విధంగా ఈ విచారణ కమిటీల చర్యలున్నాయి.

ఈ విధంగా విదేశీ పెట్టుబడియొక్క, దానికి దళారీలైన భారత బడాపెట్టుబడిదారుల యొక్క అంతులేని, అమానవీయ పురుగు మందుల సామ్రాజ్యాన్ని నేర విముక్తం చేయటమే వీరి చర్యలన్నింటి సారాంశంగా వుంది.

నిషేధించబడిన పురుగుమందులను లేదా ఒక పరిమితికి లోబడి ఉపయోగించాల్సిన, పెను ప్రమాదకరంగా మారే అవకాశమున్న పురుగు మందులను ఉపయోగించినందుకు, పొలంలో పురుగుమందులను చల్లే సమయంలో చేయ దగిన, చేయకూడని పనులుగా పేర్కొన్న వాటిని పాటించక పోయినందుకు వారు రైతులనే నిందిస్తున్నారు. వాటి విషప్రభావాన్ని బట్టీ అనేక పురుగుమందులపై వివిధ దేశాలలో నిషేధం విధించినప్పటికీ, భారతదేశంలో వాటిపై ఉద్దేశ పూర్వకంగా నిషేధం విధించకుండా, లభ్య మయ్యేట్లు చేసిన తమ నిర్వాకాన్ని కప్పిపుచ్చు కునేందుకు వారు ఈవిధంగా చాకచక్యంగా ప్రయత్నిస్తున్నారు.

ఇప్పుడు "దశలవారీగా" 18 రకాల పురుగు మందులపై నిషేధం విధించనున్నామని వారు ప్రకటించారు. పురుగుమందుల తయారీకి అవసరమైన దిగుమతులను మరియు 12 రకాల పురుగుమందులను 2018 జనవరి 1వ తేదీ నుండి, మరో 6 ఇతర పురుగుమందులను 2020 డిసెంబర్ 31నుండి నిషేధించనున్నట్లుగా ప్రకటించారు. వీనిలో అత్యధిక పురుగుమందులు తీవ్రస్థాయి విషప్రభావం కలిగివుండి తేనె టీగలకు, పక్షులకు ఎంతో హానికరంగా వున్నాయి. భూగర్భ జలాలతో సహా నీటి వనరులను ఎంతో కలుషితమం చేస్తున్నాయి.

మరోవైపున పురుగుమందుల విష ప్రభావంతో అస్వస్థతకు గురవుతున్నారని, మరణాలు సంభవిస్తున్నాయనే వార్తలనే నిరాధార మైనవిగా పురుగుమందుల పారిశ్రామిక సంస్థ అయిన 'క్రాప్‌కేర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' (సిపిఎఫ్ఐ) కొట్టిపారేస్తోంది.

పురుగుమందులు చల్లటంవలన విషప్రభావానికి గురై మరణిస్తారనే ముందస్తు అంచనా కలిగివుండటానికి బలమైన శాస్త్రీయకారణాలుండాలని ఈ సంస్థ పేర్కొంటోంది.

రసాయన పురుగుమందులు, అవి కలిగించే విషప్రభావాల గురించి దానికారణంగా మరణాల గురించి ప్రజలలో తగినంత పరిజ్ఞానం లేకపోయిన ఈ పరిస్థితుల్లో; ఈ మరణాలపై సిబిఐ సాగించే బూటకపు విచారణ నేపథ్యంలోనే 'జనెటికల్లీ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ(జిఇఏసి) యొక్క ఉపసంఘం రంగంలోకొచ్చింది. జులై 29న, చాలా త్వరితంగా జన్యుమార్పిడి ఆవాలను వ్యాపారపరంగా విడుదల చేయటానికి ప్రభుత్వ ఆమోదం పొంది సిద్ధమైంది. జన్యుమార్పిడి ఆవాలనుపయోగించి పంట పండించే రైతులు గ్లాఫోసైనైట్ కలిగివున్న చీడపీడల నివారిణిని పంటపై వుపయోగించేట్లయితే, ఆ రైతులపై చట్టపరమైన చర్య తీసుకోవలసివుంటుందని సిఫార్సు చేసింది. అమెరికా జాతీయ ఆరోగ్య సంస్థ సమాచారం ప్రకారం గ్లాఫోసైనైట్ కలిగి వున్న చీడపీడల మందులు మానవుల నాడీ మండలంపై తీవ్ర దుష్ఫలితాల్ని కలగజేస్తాయి. ఈ సిఫార్సులన్నీ–ప్రమాదకర పురుగుమందులపై కఠినమైన నిషేధాన్ని అమలుచేయకుండా పురుగు మందుల పరిశ్రమను నేరాన్నుండే విముక్తం చేసి రైతులపై మరింత భారం మోపే చర్యలు మినహా వేరుకాదు.

ఈ సంక్లిష్ట సమయంలోకూడా పాలకులు, పాలనాయంత్రాంగం నీచంగా వ్యవహరిస్తూ, విదేశీ పెట్టుబడి స్థాపించిన పురుగుమందుల పరిశ్రమ ప్రయోజనాలను రక్షించేందుకే తప్ప, దేశానికి తిండిపెట్టే, భారత ఆర్థికవ్యవస్థకు వెన్నెముకగా నిలిచే రైతుల ప్రయోజనాలు నెరవేర్చేందుకు ఏమాత్రం సిద్ధంగా లేవు.

ఈ విధంగా, పైరుపచ్చ విప్లవం వెంటాడు తున్న సమస్యలలో ఆర్థిక దుష్ఫలితాలతోపాటు పురుగుమందుల విషప్రభావమనే సమస్య ప్రమాదకరంగా వుంది. దీనిని కొనసాగనీయకుండా రాజీలేకుండా చివరికంటా పోరాడాలి.

ooooo